# లోకం తీరు

"ఫరవాలేదు. కానీ గొప్ప జాతకమేం కాదు" వేళ్ళు ముడిచి, మూసి, ఏవేవో లెక్కలు వేసి తేల్చాడు బాబయ్య.

"అయితే మనకు వద్దే వద్దు" అంది శారదమ్మ.

శారదమ్మ ఆ ఫోటోనే మళ్ళీ తీసి, అటూ ఇటూ పరికించి చూసి, దానికి జతపరిచిన వివరాల కాగితం జాతకం చూసింది. ఆ పెళ్ళి కూతురి వివరాలు వచ్చి మూడురోజులైంది.

"పిల్లెలా వుందీ?" అన్నాడు ముసలి బాబయ్య.

"ఏదో ఉంది. అయినా జాతకం కలవకపోతే వాడికా ఫొటో చూపించడమూ దండగే!" అంది చప్పరిస్తూ.

"అది కాదు శారదా! ఆ ఫొటో రాంబాబుకి చూపించు, వాడిక్కాస్త నచ్చినట్టుగా అనిపిస్తే జాతకం లోతుగా చూస్తా" అన్నాడాయన.

అందుకే రాంబాబుకు ఫోటో చూపించి "పిల్లెలా ఉందిరా?" అంది.

ఆ అమ్మాయి ఫొటోని ఓసారి చూసి నిర్లక్ష్యంగా పక్కన పడేశాడు రాంబాబు.

రాంబాబుకు ముప్పైయేళ్ళు నిండాయి. ఎనిమిది, పదేళ్ళుగా కనిపించిన అందమైన అమ్మాయినల్లా ప్రేమిస్తూనే ఉన్నాడతను. అందులో ఎక్కువ మంది సినీతారలే! నూనూగు మీసాలొస్తున్నప్పుడు శ్రీదేవిని ప్రేమించాడు. కొన్నాళ్ళకు జయప్రదను, తర్వాత మాధురీ దీక్షిత్, జుహీచావ్లా, మీనాక్షీశేషాద్రి, రవీనాటాండన్ నెమ్మది, నెమ్మదిగా సోనాలీ, సిమ్రాన్‌లనూ ప్రేమించాడు. వదిలేశాడు. తనకు పెళ్ళి సంబంధాలు వస్తే ఆ అమ్మాయి

దగ్గర దగ్గరగా ఈ జీవితాలలోని తారల స్థాయిలో ఉండాలనుకునేవాడు. అదే దృష్టితో చూడటంతో అతనికెవ్వరూ నచ్చలేదు. అలా సుమారు ఆరేళ్ళు గడిచిపోయాయి. దీనికితోడు శారదమ్మకు జాతకాల మీద విపరీతమైన నమ్మకం. 'ముందు జాతకం కలవాలి, ఆ తర్వాతే పిల్లను చూడాలి' అని నియమం పెట్టుకుందావిడ. ఇదీకాక పిల్ల అందంగా ఉండాలనేది ప్రథమ కోరిక. అయితే అందం విషయం కొడుకు చూసుకుంటాడు కనుక తను ఐశ్వర్యం, జాతకం, కట్నకానుకలు గట్రా విషయాలు చూద్దామని ఆ తల్లి ఆరాటం. తల్లీ కొడుకుల పరీక్షలకు నిలిచేటటువంటి సంబంధాలు రావడం లేదు. కాస్తోకూస్తో బాగున్న పిల్లలకు పెళ్ళిళ్ళయి పోయాయి. రాంబాబు ఇంకా వేటలోనే ఉండిపోయాడు.

అక్కడే బల్లమీదున్న ఫొటోను తీసి చూశాడు పరశురాం. కొడుకు పెళ్ళి సంగతి గురించి ఎప్పుడూ ఆలోచించడతను. ఎందుకంటే అతని అభిరుచులు, భావాలు తల్లీకొడుకులకిద్దరికీ సరిపడవు. ఉద్యోగం నుంచి రిటైరయి నాలుగేళ్ళయినా కొడుకు పెళ్ళి విషయంలో తల దూర్చలేదు. అయినా అప్పుడప్పుడు ఏదొక మాట అంటూనే ఉంటాడు. తల్లీకొడుకులిద్దరూ ఇంతెత్తున లేస్తూనే ఉంటారు.

"పిల్ల బాగానే ఉంది కదరా" అన్నాడు కొడుకువైపు చూసి పరశురాం. రాంబాబు టీవీ ఛానళ్ళు మార్చడంలో నిమగ్నమయ్యాడు. తండ్రికి ఎటువంటి సమాధానమూ ఇవ్వలేదు.

"శారదా ఆ పిల్ల జాతకమెలా ఉంది?" అన్నాడు.

"ఏంటీ పిల్ల బాగుందా?" అన్నాడు రాంబాబు విసురుగా.

"ఆ... ఆయనకందరూ బాగానే ఉంటారు" అంది శారద.

"నిజమే మరి! నిన్ను చూసిన కళ్ళతో ఎవరైనా బాగానే అనిపిస్తారు" నవ్వు ముఖంతో అన్నాడు.

"చాల్లెండి హాస్యం" అంది.

"హాస్యం కాదు. నిజమే! నువ్వు పెళ్ళి చూపుల నాటికీమాత్రమూ లేవు మరి".

"నేనప్పుడు చిన్నపిల్లను. అయినా నా అందానికేం తక్కువ?" అంటూ మూతి తిప్పింది.

"ఒరే రాముడూ, నేను కూడా చిన్నప్పుడు సావిత్రి, మధుబాల, జమునలను ప్రేమించిన వాణ్ణే! వాళ్ళందరినీ మీ అమ్మలోనే చూసుకున్నా" అంటూ ఎగతాళిగా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు లోపలి గదిలోకి.

శారదమ్మ మూతి ముప్పై వంకర్లు తిప్పి "నేనెంత మందిని ప్రేమించానో చెప్తే గుండాగి చస్తారు" అంది.

రాంబాబు మాత్రం "నాకు పిల్ల నచ్చలేదమ్మా" అన్నాడు.

"జాతకమూ అంత బాలేదు" అని తల్లి తాళం వేసింది.

రోజులు వేగంగా గడిచిపోతున్నాయి. క్యాలండర్‌లో నెలలు తిరిగి పోతున్నాయి. ఏళ్ళు గడిచాయి. రాంబాబుకి ముప్ఫై అయిదేళ్ళు నిండాయి. చూద్దాంలే అనుకుంటూ శారదమ్మ కూర్చుంది. సంబంధాలు రావడం సన్నగిల్లిపోయింది. శారదమ్మకు బెంగ మొదలైంది. కొడుక్కి ఆరాటం పెరిగింది. మిత్రులు ఛలోక్తులు విసరడం మొదలెట్టారు.

"వాడికి పిల్లని చూపించడం దండగ. నచ్చదు" అంటూ అతని ముఖం మీదే నవ్వుతూ అంటున్నారు.

"అదేంటి? వాడికి నచ్చలేదు అంతే! దానికి ఆర్గుమెంటేమిటి? నువ్వు వాడి కళ్ళెట్టుకు చూడు" అంటూ చమత్కార సంభాషణలు అతనెదుటే సాగించేవారు.

కాసంత వయసు మళ్ళిన వాళ్ళు "బ్రహ్మచారి ముదిరినా..." అంటూ హితబోధ చేసేవారు.

నెమ్మదిగా రాంబాబులో నిరాశ చోటుచేసుకుంది. ఏమీ తోచని మనస్థితి ఏర్పడింది. "అసలు తనకేం కావాలి?" అనేది అర్థం కాలేదతనికి.

అతని వయసుకు తగిన పిల్లలు తగ్గిపోయారు. ఒకవేళ ఉన్నా, పెద్దపెద్ద చదువులతో, ఉద్యోగాలతో, అంతస్థుతో రాంబాబు స్థాయికి మించిపోయారు. ఆఫీసులో తనకంటే ఎక్కువ స్థితిలో ఉన్న అమ్మాయిలకెందరికో మనసిచ్చేశాడు. వాళ్ళెవరూ ఆ మనసును తీసుకున్న ఛాయలుగానీ, తమ మనసిచ్చిన దాఖలాలు గానీ కనిపించలేదు. ఉత్తుత్తి ఊహల్లోనే అన్నీ జరిగిపోతున్నట్లనిపింది.

కొడుకు విషయంలో శారదమ్మకు, పరుశురామ్‌కూ తరచూ ఘర్షణ వస్తూనే ఉండేది.

"ఈ జాతకాల గొడవేమిటే నీకు?" అనే వాడాయన.

"మా నాన్న నలభై ఏళ్ళ క్రితం జాతకాలు సరిగ్గా చూడకుండా మన పెళ్ళి చేశాడు. అందుకే మనమిలా ఉన్నాం" అంటూ శారదమ్మ ధ్వజమెత్తేది.

"ఇప్పుడేమైంది? ఇన్నాళ్ళు బాగానే కాపురం చేశాం. ఎప్పుడూ నీ మాటే నెగ్గించుకొచ్చావు. నగలూ, నట్రా, చీరలూ, చీనాంబరాలు అన్నీ బాగానే సంపాదించుకున్నావు. మరిప్పుడు మన జాతకాలకే మొచ్చింది?"

"ఏమో నాకెప్పుడూ మీరంటే ఇష్టం లేదు. మా వాళ్ళు బలవంతంగా మీతో పెళ్ళి జరిపించారు".

శారదమ్మకు కోపం బాగా నెత్తికెక్కినప్పుడు ఇష్టమొచ్చినట్లు మాట్లాడేస్తుందని పరుశురాంకు తెలుసు. అందుకే ఆయనేం పట్టించుకోలేదు. మళ్ళీ ఆమె అందుకుంది.

"నా కొడుకూ, కోడలూ అన్యోన్యంగా ఉండాలి మనలా కాకుండా... అందుకే జాతకాలు" అంది.

"వాళ్ళు అన్యోన్యంగా ఉంటే నువ్వుండనిస్తావా ఏం?" అన్నాడు పరశురాం.

"అబ్బ! ఇంక ఆపండి మీ వాదం. పెళ్ళయ్యాక నేనిక్కడుంటే కదా" అన్నాడు రాంబాబు.

శారదమ్మ ఉలిక్కిపడి "అదేమిటి నాన్నా" అంది. 'మా అమ్మ దేవత. కోడల్ని కూతురిలా చూసుకుంటుంది' అంటాడని ఎదురుచూసిన శారదమ్మకు ఎదురుదెబ్బ తగిలింది. తర్వాతి అంశంగా ఆమెకు ఏడుపొచ్చింది. గొంతు పూడుకుపోయింది.

● ● ●

హడావుడిగా ఇంట్లోకొచ్చి "ఏమండోయ్. ఇది మీకు తెలుసా? మీ తమ్ముడి మూడో కొడుక్కి పెళ్ళి స్థిరపడిందటగా" అంది శారదమ్మ.

"నాకు తెలీదే, నీకెవరు చెప్పారు" అన్నాడు.

"సుందరమ్మ గుళ్ళో కనిపించింది. ఆవిడే నాకీ విషయం చెప్పింది".

"ఆమెగారికెలా తెలుసూ?" అన్నాడు.

"వాళ్ళ చెల్లెలి కూతురేనట" అంది.

"మరి వాళ్ళు నియోగులు. మనం వైదికులం కదా" అన్నాడు సంశయంగా.

"అవన్నీ పట్టించుకోకుండా కుదుర్చేసుకున్నారులాగుంది".

"మరి నువ్వేమో మన వాళ్ళమ్మాయే కావాలంటున్నావు కదా"

"అన్నాను. అయినా కుదరలేదుగా. ఎవరైతేనేం పిల్ల బుద్ధిమంతురాలైతే చాలు" అంది శారదమ్మ.

"ఆ విషయం జాతకంలో రాయరనుకుంటా" అన్నాడు.

"అయ్యో రామ. మన వాడికంటే అయిదేళ్ళు చిన్నవాడు, ఆఖరి వాడు... వాడికీ పెళ్ళి కుదిరిపోయింది. వీడిలాగే ఉన్నాడని నేను బాధపడుతుంటే మీరేమిటి జోకులేస్తారు?" అంది.

"జోకులేం కాదు వీడికీ చేసెయ్" అన్నాడు నెమ్మదిగా.

"ఎంత సేపూ నా తాపత్రయమే గానీ మీకేం పట్టినట్టుగా లేదు" అని సణుక్కుంటూ ఉండిపోయింది.

ఆ సాయంత్రం "శారదక్కా శారదక్కా" అంటూ తోడికోడలొచ్చింది.

"రామ్మా రా" అంటూ ఏమీ ఎరుగనట్లు ఆహ్వానించింది.

"మా వాడికి పెళ్ళి కుదిరింది. చెప్దామని వచ్చాను" అంటూ మొదలెట్టి, విశేషాలు చెప్పి కాసేపు రాంబాబు పెళ్ళి గురించి వాకబు చేసి, కాఫీ తాగి ఆమె వెళ్ళిపోయింది.

శారదమ్మ కడుపులో మంట ఒక్కసారిగా భగ్గుమంది. ఏదోకటి చేయాలని నిశ్చయించుకుంది.

పది రోజుల్లో రాంబాబుకు పెళ్ళి చూపులు ఏర్పాటుచేశారు. పిల్ల వీళ్ళ శాఖ కాదు. బి.ఏ. చదివింది. గానీ ఉద్యోగం అదీ లేదు. శారదమ్మ జాతకం ప్రసక్తి తేలేదు.

రాంబాబు కాసేపు బాలీవుడ్, టాలీవుడ్ నటీమణులందర్నీ మర్చిపోయాడు. తల్లీకొడుకులకు పిల్ల నచ్చింది. తండ్రి ఆమోదముద్ర వేశాడు.

"మేం కట్నం ఇచ్చుకోలేం" అన్నారు.

"అసలు నేను కట్నమివ్వడానికి, పుచ్చుకోడానికీ వ్యతిరేకిని" అన్నాడు రాంబాబు.

"పిల్ల రంగులో ఏముంది, పొడుగులో ఏముది? ఏదో చదువుకుంది. మనకెలాగూ ఉద్యోగం చేయించే ఉద్దేశం లేదుకదా" లాంటి మాటలతో పెళ్ళి స్థిరపడిపోయింది.

రాంబాబు మహా ఉత్సాహంగా ఉన్నాడు. కనిపించిన వాళ్ళందరికీ తన పెళ్ళి గురించి చెబుతున్నాడు. శారదమ్మ కూడా ఆనందంగానే ఉంది. జాతకాలు, రంగులు, పొట్టిపొడుగులు, చదువు ఉద్యోగాలు అన్నీ 'ఉష్' మని ఎగిరిపోయాయి.

శారదమ్మకి ఒక్కటి మాత్రం గర్వంగా ఉంది. తోడికోడలి ఆఖరి కొడుకు పెళ్ళికంటే ముందే తన ఒక్కగానొక్క కొడుక్కు పెళ్ళి చేయగల్గుతోన్నందుకు.

'ఇక్కడి పిల్లరాసి పెట్టి ఉంటే, ఎన్ని చూసినా ఎలా కుదురుతుంది?' అంటూ చాలామందిలాగే కర్మ సిద్ధాంతాన్ని వల్లించేస్తూ గలగలా నవ్వేస్తోంది.

అవును మరి, ఎవరికి మాత్రం తను తప్పిదాన్ని ఒప్పుకోవడం ఇష్టంగా వుంటుంది?! అలాంటప్పుడు దేవుడిమీదకో, విధిమీదకో తోసేయకపోతే తేలిగ్గా ఊపిరి పీల్చుకోవడమెలా?!

(ప్రజాశక్తి ఆదివారం 20-08-2006)